# వలంటీర్ల అనుబంధ 'సాయం'

- ప్రతి ఆర్బీకేకు ఒక వలంటీర్ నియామకం
- వ్యవసాయంలో అన్నదాతలకు సహకారం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

**వలంటీర్లు ఇప్పటివరకు సంక్షేమ పథకాల సేవలు అందించారు. ఇప్పుడు అన్నదాతలకు సాయం అందించనున్నారు. ఇందుకోసం రైతు భరోసా కేంద్రాల్లో ప్రత్యేకంగా వలంటీర్లను నియమించారు. విత్తు నుంచి ఎరువుల వరకు.. నాట్ల నుంచి కోతల వరకు.. కొనుగోలు నుంచి అమ్మకాల వరకు రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించే పనులకు శ్రీకారం చుట్టారు. వీరందరికీ తగిన శిక్షణ ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.**


పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

**ఐరాల:** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సేవలందిస్తున్న వలంటీర్లు ఇప్పుడు రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా పనిచేయనున్నారు. రైతులకు మరింత మెరుగైన సేవలను అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రైతు భరోసా కేంద్రానికి ఒక వలంటీర్‌ను నియమిస్తున్నారు. తద్వారా రైతు భరోసా కేంద్రాల్లో నిరంతర సేవలు అందించనున్నారు. వలంటీర్ల రాకతో ఆర్బీకేలు రైతులకు మరింత చేరువ కానున్నాయి. ముఖ్యంగా పంట దిగుబడులు వచ్చాక విక్రయానికి రైతుల అవస్థలను గుర్తించి ధాన్యం కొనుగోలులో వలంటీర్ల సేవలను వినియోగించుకునేలా ప్రణాళికలు తయారు చేశారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనం నుంచి పంట విక్రయం వరకు రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే ఆలోచనతో ప్రతి ఆర్బీకేకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ పంటల సాగు ఆధారంగా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ పనిచేస్తున్నారు. వీరందరూ ఆర్బీకే ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. అయితే వీరంతా ఎక్కువ సమయాన్ని క్షేత్ర స్థాయిలో గడపాల్సి వస్తోంది. ప్రధానంగా పంటల సాగు సమయంలో ఈ–క్రాప్ నమోదు కోసం రోజుల తరబడి పంట పొలాల్లో తిరుగుతున్నారు. దీంతోపాటు వారంలో ఒక రోజు పొలంబడి కార్యక్రమం నిర్వహించాలి. వీటితోపాటు మండల స్థాయిలో నిర్వహించే సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలకు హాజరుకావాల్సి ఉంది. ఇలాంటి సమయాల్లో రైతు భరోసా కేంద్రాల్లో ఉండే అవకాశం లేదు. రైతులకు ఈ సమస్య ఉండకూడదని భావించి సమస్య పరిష్కారానికి ప్రతి ఆర్బీకేకు ఒక వలంటీర్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

**వలంటీర్ల ఎంపిక**

మండలంలో 18 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వలంటీర్లకు ఆర్థిక నిర్వహణపై, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుపై శిక్షణ ఇచ్చారు. విత్తనాల పంపిణీ, డిజిటల్ కియోస్క్ ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు ఆర్డర్ పెట్టడం, పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు ఆర్బీకే ఇన్‌చార్జి పర్యవేక్షణలో వలంటీర్లు చేయనున్నారు. వలంటీర్లు నేరుగా రైతు వద్దనే ధాన్యం సేకరించి వారికి మద్దతు ధర అందించేలా చర్యలు తీసుకుంటారు.

| అందిస్తున్న సేవలు | | |
|---|---|---|
| వ్యవసాయశాఖ | - | 25 |
| ఏబీఎంఐపీ | - | 02 |
| మత్స్యశాఖ | - | 07 |
| ఉద్యానశాఖ | - | 04 |
| పశుసంవర్ధకశాఖ | - | 10 |
| పట్టు పరిశ్రమశాఖ | - | 06 |

**దేశానికే రోల్ మోడల్**

గ్రామ స్థాయిలో ఆర్బీకేలు ఏర్పాటు కావడంతో రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. విత్తన ఎంపిక నుంచి పంట విక్రయం వరకు అన్నిసేవలు సొంత గ్రామాల్లోనే ఆర్బీకేల ద్వారా అందుతున్నాయి. దీంతో రైతు భరోసా కేంద్రాలు దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయి. తాజాగా ప్రతి ఆర్బీకేకు ఒక వలంటీర్‌ను నియమించడంతో మరో విప్లవాత్మక మార్పు చోటుచేసుకుంది. గతంలో ప్రైవేటు డీలర్లు రసాయన ఎరువులను అడ్డగోలుగా అధిక ధరలకు విక్రయించేవారు. ఎమ్మార్పీపై రూ.50 నుంచి రూ.100 వరకు అధికంగా వసూలు చేసేవారు. ఆర్బీకే వల్ల ప్రైవేటు డీలర్ల అక్రమాలు చాలా వరకు తగ్గిపోయాయి. తాజాగా వలంటీర్ల నియామకంతో మరింత మెరుగైన సేవలు అందనున్నాయి.

**మంచి నిర్ణయం**



రైతుల మేలు కోసం ఆర్బీకేలో ఒక వలంటీర్‌ను నియమించడం మంచి నిర్ణయం. వ్యవసాయ గ్రామ సహాయకులు ఏదైనా పనుల నిమిత్తం బయటకు వెళితే రైతులు ఇబ్బంది పడుతారనే సమస్యను ముందుగా గుర్తించి ఆర్బీకేకు ఒక వలంటీర్‌ను నియమించడం గొప్ప ఆలోచన. రైతుల సమస్యలను గుర్తించి వలంటీర్‌ను నియమించినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

–నందకుమార్, రైతుమిత్ర, సీ.వీ.పల్లె, ఐరాల

**శుభపరిణామం**



ప్రతి ఆర్బీకేకు వలంటీర్‌ను నియమించడం శుభపరిణామం. దీంతో రైతులకు సేవలు మరింత చేరువవుతాయి. ఇప్పటికే ఆర్బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగులమందులు పొందుతున్నాం. ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచడం మంచి నిర్ణయం. వ్యవసాయాధికారులు రైతుల పొలాలకు వచ్చి పంటలను చూసి సూచనలు, సలహాలు ఇవ్వడంతో మేలు జరుగుతోంది.

–దేవేంద్రరెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు, ఐరాల

**వలంటీర్లకు సమగ్ర శిక్షణ**



మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో వలంటీర్ల నియమాకం పూర్తయింది. వారికి ఆర్బీకే నిర్వహణపై సమగ్ర శిక్షణ కూడా ఇస్తాం. ఆర్బీకే ఇన్‌చార్జులు క్షేత్రస్థాయిలో వెళ్లిన సమయంలో రైతులకు వలంటీర్లే అన్ని సేవలు అందించాల్సి ఉంటుంది.

–వరలక్ష్మి, ఏఓ, ఐరాల

## క్లుప్తంగా

### క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలి

**బంగారుపాళెం:** క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని బంగారుపాళెం సర్పంచ్ ఉమాదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' అనే కార్యక్రమం ద్వారా క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులు తమ పేర్లను వలంటీర్ల ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. క్రికెట్, వాలీబాల్, కబాడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో క్రీడలకు సంబంధించిన క్రీడాకారులు ఈ నెలాఖరు లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

### పఠనాసక్తిని పెంపొందించుకోవాలి


కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎర్రయ్య

**ఐరాల:** విద్యార్థులు సమీపంలోని గ్రంథాలయానికి వెళ్లి పఠనాసక్తిని పెంపొందించుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో కవి సమ్మేళనం, సెమినార్లు, రచయితల సందేశాలను వినిపించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎర్రయ్య మాట్లాడుతూ సమాజానికి సందేశాన్ని ఇచ్చేలా కవులు, గ్రంథాలు ఉండాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

### అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

**యాదమరి:** మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. తమిళ కార్తిక నెల శుక్రవారం ప్రారంభం కావడంతో ఉదయం అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు స్వామి వారికి నెయ్యాభిషేకం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. 48 రోజుల పాటు ఆలయంలో మండల కాలం పూజలు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు రమేష్‌బాబు, దేవరాజులు పాల్గొన్నారు.

### మెనూ ప్రకారం వడ్డించాలి


ఫోర్టిఫైడ్ రైస్‌ను తనిఖీ చేస్తున్న మండల విద్యాశాఖ అధికారి

**గుడిపాల:** మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని మండల విద్యాశాఖ అధికారి రామ్ నాయక్ అన్నారు. నరహరిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయడంతోపాటు ఫోర్టిఫైడ్ రైస్, చిక్కీలు, కోడిగుడ్లు స్టాక్ రిజిస్టర్ ప్రకారం ఉన్నాయా లేదా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా నాణ్యతను కచ్చితంగా పాటించాలన్నారు. ఆయనతోపాటు ఎంఈఓ గణపతి, సీఆర్పీ వాణి, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ పాల్గొన్నారు.

### ఫ్యామిలీ డాక్టర్‌ను వినియోగించుకోవాలి


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

**తవణంపల్లె:** ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని జి.గొల్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ మోహన్‌వేలు రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు, గర్భవతులకు, బాలింతలకు పరీక్షలు చేసి, సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు క్రమం తప్పకుండా ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం, తాజా కూరగాయలు, ఆకుకూరలు భుజించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### అనుమతులు తప్పనిసరి


లేఅవుట్‌లకు సంబంధించి రికార్డులు చూపుతున్న మధు

**గుడిపాల:** భవన నిర్మాణాలకు, లే అవుట్లకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని చుడా జిల్లా టౌన్ అండ్ ప్లానింగ్ ఆఫీసర్ కె.ఆర్.మధు అన్నారు. వసంతాపురం సచివాలయంలో శుక్రవారం భవన నిర్మాణాలు, లే అవుట్లకు సంబంధించి ఎన్ని అనుమతులు ఇచ్చారు అన్న వాటిపై పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించి రికార్డులను పరిశీలించారు. భవన నిర్మాణాల అనుమతులు, అతిక్రమణలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు.

### ఉపాధ్యాయ వృత్తి గొప్పది


మాట్లాడుతున్న రెవరెండ్ ఆర్థర్ శామ్యూల్

**చిత్తూరు కలెక్టరేట్ :** ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని రెవరెండ్ ఆర్థర్ శామ్యూల్ అన్నారు. స్థానిక కొంగారెడ్డిపల్లిలో ఉన్న షర్మన్ బాలికోన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన హిందీ ఉపాధ్యాయిని స్వర్గీయ కస్తూరిబాయి సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించారు. పాల్గొన్న కరస్పాండెంట్ రాజశేఖర్ మాట్లాడుతూ కస్తూరిబాయి 33 ఏళ్ల పాటు షర్మన్‌పాఠశాలలో హిందీ ఉపాధ్యాయినిగా విధులు నిర్వహించారన్నారు. అనంతరం కస్తూరిబాయికి షర్మన్ పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని మాజీ హెచ్‌ఎం సుగుణ తిలగం, నవీన, తెన్మొయి తదితరులు విద్యార్థులకు వివరించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## వాడవాడలా నాగుల చవితి వేడుకలు

**ఐరాల:** దీపావళి అనంతరం వచ్చే కార్తిక శుద్ధ చవితిని పురస్కరించుకుని మండలంలో నాగుల చవితి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వేకువజాము నుంచి కుటుంబ సభ్యులంతా కలిసి పుట్ట వద్దకు వెళ్లి సంప్రదాయంగా పూజలు చేశారు. సమీపంలో ఉన్న పుట్టలను శుభ్రం చేసి, నీటితో అలికి ముగ్గులు పెట్టారు. పసుపు, కుంకుమ నైవేద్యాలు సమర్పించారు. పుట్టలో పాలుపోసి గుడ్లు, నువ్వులు, సజ్జలు, బెల్లంతో తయారు చేసిన పదార్థాలను నాగేంద్రుడికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయాల్లోని నాగేంద్రుని విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఆలయాలు నాగుల చవితి సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి.


మఠంపల్లెలో పూజలు చేస్తున్న మహిళలు

**తవణంపల్లె:** నాగుల చవితి సందర్భంగా మండలంలోని మహిళలు నాగదేవతకు పూజలు చేశారు. గ్రామాల్లో ఉన్న పుట్టలకు పూజలు చేసి, నాగదేవతకు పాలు, గుడ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

**చిత్తూరు రూరల్:** నగరంలో శుక్రవారం నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంతపేట, ప్రశాంత్ నగర్ మురకంబట్టు, మంగసముద్రం తదితర ప్రాంతాల్లోని నాగదేవత ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. ఆలయ ఆవరణలోని పుట్టకు పూజలు చేసి పాలు గుడ్లు సమర్పించారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

**పాలసముద్రం :** మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నాగుల చవితి పూజలు చేశారు. శ్రీబొమ్మరాజుపురం, పాలసముద్రం బీసీ కాలనిలో గ్రామానికి సమీపంలో ఉన్న పుట్టకు పసుపు, కుంకుమం పెట్టా పూజ చేశారు. పుట్టలో పాలు, గుడ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## ఆశా కార్యకర్తలే పల్లెకు పట్టుగొమ్మలు


యూనిఫాం అందుకున్న ఆశాకార్యకర్తలతో వైద్యాధికారి సురేఖ

**యాదమరి:** ఆశా కార్యకర్తలే పల్లెకు పట్టుగొమ్మలని మండల వైద్యాధికారి సురేఖ తెలిపారు. యాదమరి ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తరపున రెండు జతల యూనిఫాం వారికి అందజేశారు. అనంతరం సురేఖ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉంటే దోమలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు ఎవరికైనా జ్వరాలు, అంటువ్యాధులు వ్యాపించాయా అని పరిశీలించాలని చెప్పారు. జ్వరాలు సోకి ఉంటే వెంటనే ఏఎన్‌ఎంలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆస్పత్రికి సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా ఉండాలని సూచించారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు బహుమతులు


విద్యార్థులతో పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మణ్

**చిత్తూరు కార్పొరేషన్:** తపాలా సేవలపై నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఫిలటాలీ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందజేశారు. క్విజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు బృందావన్, పీసీఆర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, వ్యాసరచనలో నారాయణ టెక్నో, క్యాంఫోర్డు, ఒలింపియార్డు, స్టాంప్స్ డిజైనింగ్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బీవీరెడ్డి, దేవిబాలమందిర్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. వీరికి పోస్ట్‌మాస్టర్ ఆఫ్ జనరల్ మూర్తి, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ స్టేట్ సందీప్ మహాదేవయ్య, కర్నూలు రీజియన్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ జగదీష్, పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్లు జాఫర్‌సాధిక్, లక్ష్మణ్ బహుమతులు అందజేశారు. పోస్ట్‌మాస్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

### నేటి నుంచి ధ్యాన మహాయజ్ఞం

**తవణంపల్లె:** మండలంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ధ్యాన మహాయజ్ఞం కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్లోబల్ స్పిరిచువల్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు ప్లేడియన్ టీచింగ్స్, మెడిటేషన్, చక్ర మెడిటేషన్, లైట్ మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ధ్యానులు పాల్గొని ధ్యాన మహాయజ్ఞం విజయవంతం చేయాలని కోరారు.

### బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌గా భానుప్రకాష్

**బంగారుపాళెం:** పూతలపట్టు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా మండలంలోని మొగిలివెంకటగిరి గ్రామానికి చెందిన భానుప్రకాష్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. భానుప్రకాష్ మాట్లాడుతూ, బీజేపీ బలోపేతానికి శక్తి వంచనలేకుండా కృషి చేస్తానన్నారు.

## కవిత్వంతో సృజనాత్మకతకు మరింత పదును



చిత్తూరు: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సన్మానం అందుకున్న కవులు, కవయిత్రులు, పూతలపట్టు: సమావేశంలో మాట్లాడుతున్న కవి హరికృష్ణారెడ్డి

**చిత్తూరు కార్పొరేషన్:** కవితలతో సృజనకు పదును పెట్టవచ్చని కవయిత్రి డాక్టర్ రామలక్ష్మమ్మ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆమె ప్రసంగించారు. చిన్నతనంలో గ్రంథాలయాలకు వెళ్లడం ద్వారా సాహిత్యంపై ఆసక్తి పెరిగిందని చెప్పారు. పుస్తకాల ఆవశ్యకతను కవి హరికృష్ణారెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి లలిత, రచయితలు అరుణ, విజయ్‌కుమార్, మిట్టలక్ష్మి, పూర్ణిమ, సంధ్యాశర్మ, కృష్ణవేణి, సహదేనాయుడు, భాస్కర్‌రెడ్డి, శీలా, రమేష్, పద్మజ, సునీత, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ తదితరులు పాల్గొన్నారు.

**సాహిత్యం వెలుగురేఖ వంటిది**

**పూతలపట్టు:** సాహిత్యం సమాజానికి వెలుగు రేఖ వంటిదని ఉపరాష్ట్రపతి అవార్డు గ్రహీత హరికృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కవి సమ్మేళనం నిర్వహించారు. అందులో కవి హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజ చైతన్యానికి, గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు. విద్యార్థులు, యువత పుస్తక పఠనంతో జ్ఞానం పెంచుకోవాలని సూచించారు. తెలుగు భాషపై మంచి కవితలు వినిపించి విద్యార్థులను మైమరపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, నాదముని, గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెత్త దిబ్బలు తొలగించి మొక్కలు నాటి..



వ్యర్థాలను తొలగించి పూలమొక్క నాటుతున్న చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్ అరుణ, సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

**చిత్తూరు అర్బన్:** ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా నగరంలో వ్యర్థాలతో నిండిన ప్రాంతాలను గుర్తించి పచ్చదనాన్ని నింపేందుకు నగర కమిషనర్ అరుణ శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 34వ వార్డులోని ఆర్టీసీ డిపో రోడ్డులో వ్యర్థాలతో నిండిన ప్రాంతాన్ని నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు శుభ్రం చేయించారు. శుభ్రం చేసిన ప్రాంతంలో శుక్రవారం ఉదయం నగర కమిషనర్ మొక్కలు నాటారు. పూల వనంతో ఆ ప్రాంతాన్ని నింపేశారు. ఆమె మాట్లాడుతూ, వీధుల్లో, నివాసాల మధ్య ఇష్టారాజ్యంగా వ్యర్థాలు పడేయరాదని, వ్యర్థాలను తడి, పొడిగా వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అందివ్వాలని చెప్పారు. అన్ని వార్డుల్లో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని, స్థానిక ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. నివాసాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలు నాటిన ప్రాంతంలో చెత్త వేయరాదంటూ బోర్డులు ఏర్పాటు చేయాలని, రోజూ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డా. లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

**ఉమ్మడి ఖాతాలు తెరిపించండి**

జగనన్న విద్యాదీవెన నాలుగో విడత పథకం లబ్ధి కోసం సంబంధిత విద్యార్థి, వారి తల్లి పేరుతో ఉమ్మడి బ్యాంకు ఖాతాలు తెరిపించాలని నగర కమిషనర్ అరుణ అన్నారు. జగనన్న విద్యాదీవెన పథకంపై శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మితో కలిసి వార్డు సంక్షేమ కార్యదర్శులు, సీవోలు, ఆర్పీలకు సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులకు «జగనన్న విద్యా దీవెన» నాలుగో విడత ద్వారా లబ్ధి పొందేందుకు సంబంధిత విద్యార్థి తల్లి పేరుతో ఉమ్మడి బ్యాంకు ఖాతాలు తప్పనిసరిగా తెరిపించాలన్నారు. మరో మూడు రోజుల్లో ఉమ్మడి బ్యాంకు ఖాతాలు తెరిపించేలా విద్యార్థులు, వారి తల్లులను సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. సీఓలు, ఆర్పీలు బ్యాంకు అధికారులతో చర్చించి ఖాతాలు తెరవడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. ప్రారంభించిన ఉమ్మడి ఖాతాల వివరాలను వార్డు సచివాలయంలో ఎడ్యుకేషన్ సెక్రటరీల ద్వారా నవశకం పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, మేనేజర్ ఉమామహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**క్షేత్రస్థాయిలో పక్కాగా కులగణన**

కుల గణన ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పక్కాగా చేపట్టాలని కమిషనర్ అరుణ చెప్పారు. చిత్తూరు కార్పొరేషన్‌తోపాటు చిత్తూరు రూరల్ మండలాల పరిధిలో కులగణన –2023 నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లకు శుక్రవారం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు అర్బన్ మాస్టర్ ట్రైనర్, డిప్యూటీ కలెక్టర్ శివయ్య మున్సిపల్, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కులగణన కార్యక్రమాన్ని ఎలాంటి పొరబాట్లకు ఆస్కారం లేకుండా చేయాలన్నారు. సర్వే నిర్వహణపై అవగాహన పెంచుకుని, వార్డు స్థాయిలో వలంటీర్లకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ శివయ్య మాట్లాడుతూ, కులగణన –2023 సర్వే నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలన్నారు. వార్డు స్థాయిలో ఈనెల 21–23వ తేదీల మధ్య వలంటీర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. కులగణన యాప్‌లో నిర్దేశించిన మేరకు తప్పులు లేని వివరాలను నమోదు చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయి సర్వేపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, తాహసిల్దార్ మురళీమోహన్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

### బాలల భవిత కేంద్రంలో సంబరాలు


పిల్లలతో కేక్ కట్ చేయిస్తున్న కేంద్ర నిర్వాహకులు

**చిత్తూరు రూరల్:** చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని బాలల భవిత కేంద్రంలో శుక్రవారం బాలల వారోత్సవాలను నిర్వహించారు. పిల్లల చేత కేక్ కట్ చేయించారు. అనంతరం పిల్లలకు వైద్య సేవలను అందించారు. పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సదుపాయాలు, సేవలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ సుదర్శన్, మురళి, దుర్గాప్రసాద్ నాయుడు, శ్రీదేవి, శబరీష్ పాల్గొన్నారు.

### నేడు కులగణనపై శిక్షణ

**తవణంపల్లె:** కులగణనపై సర్వేపై మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, సూపర్‌వైజర్లకు ఒక్కరోజు పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. దీనికి మండలంలోని డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు తప్పక హాజరుకావాలని కోరారు.